# మరో రచయిత్రి పుట్టింది

## మోనాలిసా

**అప్పలనరసమ్మ హతాశురాలైంది అన్న పానీయాలు ముట్టడం మానేసింది ఆమె పరిస్థితిని వివరిస్తూ ఆమె తమ్ముడొక ఉత్తరం వ్రాశాడు ఆంజనేయరావ్‌కి వెంటనే ఆంజనేయరావు రెక్కలు గట్టుకొని వచ్చివాలాడు అప్పలనరసమ్మని ఓదార్చడం ప్రారంభించాడు.......**

డజను చింతకాయలు, కాస్తంత ఉప్పూ కారం కలిపిన మిశ్రమం ఒక కాగితంలో పెట్టుకొని, పాత వంగిరి పరుపు మంచమ్మీద బోర్లా పడుకొని, పక్కింటి హనుమాయమ్మ గారి దగ్గర్నుంచి అరువు తెచ్చుకొన్న వార పత్రికని పఠించటానికి అన్ని ఎరేంజ్‌మెంటు చేసుకొన్న అప్పలనరసమ్మకి, పత్రికని రెండు పేజీలు తిప్పగానే చటుక్కున తట్టిందొక ఆలోచన

అంతే! గభాల్న మంచమ్మీద లేచికూర్చొని ఎవరు వ్రాసిన ఏయేకథలున్నాయో తెల్సుకోటానికై విషయసూచిక చూచింది ఆ వెంటనే అలమర వద్దకు నడిచి వాళ్ళ నాన్న డైరీలోంచి ఒక కార్డు తీసి ఇలా వ్రాసింది.

ఎడిటర్ గార్కి,

మీ పత్రికని ప్రతివారం అభిమానంతో "కొని" చదివే పాఠకులలో నేనొకదాన్ని ఈ వారం మీ(మా) పత్రికలో పడిన ఫలానా రచయిత వ్రాసిన ఫలానా కథ చాలాబాగుంది. వ్రాసిన రచయితకూ, ప్రచురించిన మీకూ నా అభినందనలు ("అభివందనలా?" "అభి నంధనలా?" అని సందిగ్ధంలోపడిన పాఠకులకి నావొక మనవి. అచ్చు తప్పేంకాదు! మీరనుకొంటున్నట్టు "అభినందనలే" కరెక్! ఒకక్షరమేకదా తేడా: ఈసారికి క్షమించలేరూ! పాపం అప్పలనరమ్మ కొత్తగా ఉత్తరాలు వ్రాయటం మొదలుపెట్టినామెకదా ?!)

ఇట్లు,

మీ అభిమాన పాఠకురాలు,

అప్పల నరసమ్మ వ్రాలు

(ఇంతకూ మీకు (పాఠకులకి) అసలు విషయం చెప్పలేదుకదూ! నా మతిమరుపు నాలోనే ఉండిపోనూ! మీకు వ్యాఖ్యానించకుండా. ఆ వారపత్రిక తిరగేస్తుండగా అప్పలనరసమ్మకి వచ్చిన అయిడియా యిది! "నాపేరు అచ్చులో చూసుకోవాలి- నేనుకూడా పత్రికలకి ఉత్తరాలు వ్రాస్తే....?" అయినా ఈ విషయం నేను చెప్పాలా? ఈ పేరా చదవకముందే ఊహించేసి ఉంటారు. కాదా ?!)

పత్రికలోచూచి ఆ కార్డుమీద పత్రికఅడ్రెస్ వ్రాసింది. తర్వాత తాము ఉండే ఇంటి సందు చివరున్న పోస్టుడబ్బా వద్దకు తానే స్వయంగా వెళ్ళి కార్డును డబ్బాలో పడేసింది.

(ఇంతకీ ఆ పత్రికలో పడిన ఫలానా రచయిత వ్రాసిన ఫలానా కథ ఆమె కార్డు వ్రాసేటప్పటికి చదవలేదని గమనించారా పాఠకులూ ?!)

అప్పల నరసమ్మ మధ్య తరగతిలో మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఆడప్రాణి! పదోతరగతి పాసై, అంతకుమించి చదివే ఓపిక తనకి, చదివించే ఆర్థికస్తోమత తండ్రికి లేకపోవటంచేత ఇంట్లోనే ఉంటూంది. చాలా మంది ఆడపిల్లల్లా, ఎదురింటి పంకజం అక్కా, పొరుగింటి పాపాయమ్మపిన్ని, అవతలింటి అరుంధతి అత్తయ్యగార్ల దగ్గర పత్రికలు అరువు తెచ్చుకొని, వాటిని తన శక్త్యానుసారం కంఠతా పట్టినట్లు—....వారపత్రిక, వెల 1 రూపాయి,....మాసపత్రిక, వెల రూ 3-00 దగ్గర్నుంచి, ప్రింటెడ్ అండ్ పబ్లిష్‌డ్ బై .... వరకూ క్షుణ్ణంగా చదువుతూ కాలక్షేపం చేస్తూంది. ఎదురింట్లో అద్దెకి ఉంటున్న స్టూడెంట్‌పై చిరునవ్వుల పువ్వులు రువ్వుతూ అతడిచేత రోజుకొక అద్దెనవలకూడా తెప్పించుకొంటున్నది! అద్దె చెల్లించేది మాత్రం అల్పసంతోషి, మొహమాటస్థుడూ అయినట్టి ఆ స్టూడెంటే!

"మధ్యతరగతి జీవంటే ఏ సీత, రాధ, గీత, లక్ష్మి, వగైరాలవంటి కాస్త మంచి పేరు పెట్టుకోవచ్చుకదా? మరీ ఇదిగా అప్పల నరసమ్మ ఏమిటి?" అన్న అనుమానం పాఠకులకి వచ్చిఉండొచ్చు తనపేరు తనే పెట్టుకొనేట్లయితే ఆ పేరేమిటి. సరిత, స్వప్న కీర్తి, విసీల వంటి పేర్లలో ఏదో ఒకటి పెట్టుకొనేదామె, కాని పేర్లు పెట్టటం దగ్గర్నుంచే పిల్లలమీద తమకి గల నిరంకుశాధికారాన్ని డిక్లేర్‌చేసే తల్లిదండ్రులు నిండాగల దేశం మనది: అంతేగాక ఆమెకా పేరుపెట్టటానికొక కారణంవుంది. ఆమెకన్నా ముందుపుట్టిన నలుగురు నలుసులూ, పురిట్లో ఒకరూ, మిగతా ముగ్గురూ కొంత పెరిగిన తర్వాత 'పరలోకానికి ప్రయాణం కట్టేశారు. అంచేత "ఏదైనా పిచ్చిపేరు పెడితే ఈ నలుసు నిలిచి, నిపసి




స్తుందీ భూమిపై' అని ఇరుగు పొరుగులిచ్చిన సెలవుతో ఆ పేరు పెట్టారామె తలిదండ్రులు.

“ఛీఛీ. అసయ్యం! ఇదేం పేరు? పంకజం అక్కవాళ్ళ పనిమనిషి అప్పలమ్మలా ఛీఛీ. ఈ పేరుపెట్టి నన్ను నవ్వులపాలు చేశారుకదే! ఈ పేరుతో బతికుండే బదులు చచ్చిపోటం నయం. సుబ్బరంగా ఏ విసీలో, సరితో పెడితే చిన్నప్పుడే చచ్చుండేదాన్నేమో? అదే నయం. ఇట్లాంటి పేరుతో జీవితాంతం బాధపడుతూ బతికేకన్నా!” అంటూ ఆమె తల్లిమీద విరుచుకుపడిన సందర్భాలు లేకపోలేదు. శిల్ప, అర్పణ వంటి పేర్లుగల హీరోయిన్స్ ఉన్న నవలలు పఠించినప్పుడు!

అప్పలనరసమ్మ ఆ కార్డు పోస్ట్ చేసిన వారం రోజులకి ఆ వారపత్రిక తరువాతిసంచిక వచ్చింది. బజారునుంచి ఆ పత్రికను కొనుక్కొని వస్తున్న హనుమాయమ్మగారి పదేళ్ళ అబ్బాయిని వీధిలోనే అటకాయించి పత్రికని లాక్కొన్నట్టుగా తీసుకొంది అప్పలనరసమ్మ. గబగబా ఉత్తరాల శీర్షికలో చూచింది. తన ఉత్తరం అచ్చయిందేమోనని! ప్చ! అచ్చవలేదు.

అప్పలనరసమ్మ మనసుని వైరాగ్యంలాంటి భావం ఆవరించేసింది.

నిరాశగా తిరిగిచ్చేసిందా పత్రికని.

ఒక వారంవరకూ అన్నపానీయాలు (ఐ మీన్–నవలలు, పత్రికలు) ముట్టలేదు. (చదవలేదు)

ఆవారం ఎదురింట్లోని స్టూడెంట్‌కి రెండు రూపాయల పదిపైసలు–ఏడు ముప్పైలు— ఆదా. అప్పలనరసమ్మకి అద్దె నవలలుతెచ్చిచ్చే అవసరం లేకపోవటంవల్ల!

వారంగడిచాక ఆ పత్రిక మరొక సంచిక వచ్చింది. ఐస్‌ఫ్రూట్ అబ్బాయిని కేకెయ్యటానికి వీధిగుమ్మంలోకివచ్చిన అప్పలనరసమ్మకి హనుమాయమ్మగారి అబ్బాయి కొత్త వారపత్రికను తెస్తూ కనిపించాడు.

ఈవారంగాని పడిందేమోనన్న అనుమానంతో. ఆసక్తిగా అతడిచేతిలో పత్రికను తీసుకొన్న ఆమెకి ఉత్తరాల శీర్షికలో మొదటి ఉత్తరం తనపేరుతో, తను వ్రాసిన మేటర్‌తో అచ్చవటం ఎంతో సంభ్రమాన్ని. మరెంతో ఆనందాన్నీ కల్గించింది. పత్రిక పుచ్చుకొని పరుగెత్తినట్లుగా లోపలికివెళ్ళి. పడుకొనివున్న తల్లిని లేపి అచ్చులోఉన్న తన పేరును చూపించింది.

విసుక్కొంటూలేచిన ఆమెతల్లి పత్రికకేసి వింతగా చూచింది. ఆమెకు చదవటం రాదు మరి! విషయంవిని మొదట ఆశ్చర్యపోయింది.

తర్వాత, "అయ్యయ్యో! పత్రికలో నీపేరు పడిందా? అందుకు ఏడ్చేబదులు సంతోషిస్తున్నావా? ఇట్లాంటి అరిష్టప్పనులు మన ఇంటా వంటా. ఉన్నయ్యా? పేరు పత్రికల్లోను. పేపర్లోనూ పడితే నీకు పెళ్ళెట్లాఅవుతుందే పిచ్చిముండా!" అంటూ తలపట్టుకొని కూర్చొండిపోయిందలాగే మంచమ్మీద.

"ఏమీ అవదులేవే! నీకేం తెలీదులేవే!" అని తల్లికి సమాధానంచెప్పి. వంటింట్లోకి పరుగెత్తి పోపుల డబ్బాలోంచి రూపాయితీసి. హనుమాయమ్మగారి అబ్బాయికిచ్చి. "నేనీ పత్రిక తీసుకొంటాను. ఇంకో పత్రిక కొని తెచ్చి మీ అమ్మగారికివ్వు" అన్నది. ఆ ఆనందంలో అతడ్ని జీడి కొనుక్కోమని ఐదుపైసలుకూడా ఇచ్చింది.

తర్వాత మండువేసవిలో మండిపడుతున్న సూర్యుడ్నికూడా ఏమాత్రం లెక్కచెయ్యకుండా తమ వీధిలోని తెల్సినవారి ఇళ్ళన్నీ తిరిగింది. చదవటం వచ్చినవారికి పత్రికలో తన పేరు చూపిస్తే వాళ్ళే చదువుకున్నారు ఆమె పేరూ, ఉత్తరమూ. "బావుంది" అనకపోతే "బావుండ" దన్న లోకజ్ఞానం గలవారు "బావుం" దనేశారు కూడా! చదవటం రాని వారికితను వ్రాసిన (అచ్చయిన) ఉత్తరం చదివి వినిపించింది (చదవటంరాని బామ్మలకీ, మామ్మలకీ తరచుగా సీరియల్సు. కథలూ, సినిమా విశేషాలూ చదివి వినిపించటం ఆమె కలవాటే!) ఆరోజంతా పత్రికలో తన పేరు చూస్తూనే—ఏమీ చదవకుండా—గడిపేసింది, సాయంత్రం స్కూల్నుంచివచ్చిన తమ్ముడికీ, ఆఫీసునుండివచ్చిన తండ్రికీ తన పేరు చూపించింది. తమ్ముడు ఆశ్చర్యపోతే, తండ్రి వొకింత ఆనందపడ్డాడు. ఏడుస్తూకూచున్న తల్లిని "నరుసు పేరు పత్రికలో పడినంతలో ఏంకాదులేవే! దానికి పెళ్ళవుతుందిలేవే! ఫర్వాలేదులేవే!" అని "లేవే" అను అంత్యప్రాసలుగా వాడి ఓదార్చాడు. "ముందు ముందిది కథలూ. నవల్లూరాసి సంపాదించి. కట్నం ఇవ్వగల్గితే" అన్న వాక్యాన్ని అతడు చేర్చలేదు. అతడికి భవిష్యత్తు తెలీదుమరి! అది తెలీడానికి కతడేం జ్యోతిష్కుడు కాదు.

తర్వాత రెండు రోజులకి మేనబావ అయిన ఆంజనేయరావ్ దగ్గరనుండి ఒక ఉత్తరం వచ్చింది అప్పలనరసమ్మకి. పేరుచూచి ఆంజనేయుళ్ళా ఉంటాడని అపోహపడేరు! లేదు ....అతడెంచక్కా తెలుగు సినిమా హీరోలా ఉంటాడు. ("అయితే ముసలాడా?" అంటున్నాగా పాఠకులూ...."ఛ్ఛ!....మీరిట్లా అపార్థము చేసుకొంటే ఎలా? అతడు నవ యువకుడు. మనిషి అందగాడేగానీ చేష్టలుమాత్రం పేరుకుతగ్గట్లే ఉంటాయి, తెలుగు సినిమా హీరోలా")

ఆంజనేయరావ్ బియ్యే ఫైనలియర్ చదువుతున్నాడు. మూడేళ్ళుగా. అతడు బియ్యే ఫైనలియర్ గట్టెక్కే అవకాశాలు శూన్యం. గట్టెక్కుదామని అతడుచేసిన ప్రయత్నాలను ఆ క్లాసు కుదరనివ్వలేదు. బియ్యే ఫైనలియర్ అతడ్ని తెలుగు సినిమాలో డ్యూయెట్ సన్నివేశంలో హీరో హీరోయిన్‌ని పెనవేసుకొన్నట్లుగా పట్టుకొని విడవట్లేదు.

ఇక అతడు అప్పలనరసమ్మకి వ్రాసిన ఉత్తరంలో సారాంశం.

"మైడియర్ స్వీట్ నరుసూ,

నీ ఉత్తరం ఫలానా తేదీగల ఫలానా పత్రికలో చూశాన్లే! నా ఉత్తర మేవన్నా పడిందేమోనని చూస్తుంటే, ఇంతింత అక్షరాల్లో నీపేరు. ఊరు నువ్వు వ్రాసిన ఉత్తరం కనపడ్డాయి. ఆ ఉత్తరంలో శైలి అద్భుతం! అటువంటి ఉత్తరం ఇంతవరకూ చదవలేదంటే నమ్ము! చాలాకాలానికొక మంచి ఉత్తరం చదివానన్న తృప్తికలిగింది నాకాఉత్తరం చదివాక. ఆ ఉత్తరం ఉత్తరాల రచయిత్రిగా నీకెంతో భవిష్యత్తుఉందని తెలుపుతూంది. ముందుముందు నువ్విటువంటి ఉత్తరాలెన్నో వ్రాసి, ఉత్తరాల రచయిత్రిగా ఉన్నత శిఖరాలనందుకొంటావని ఆశిస్తున్నాను.

—నీ అంజి!"

అతడు పై విషయాలే కాదు. మరెంతో వ్రాశాడు. అందులో కొంత 'సెన్సార్' చెయ్యగా మిగిలింది పై మేటర్ మాత్రమే!




## ప్రేమ గురుతు!

"షాజహాన్ చక్రవర్తి తన భార్యమీద ప్రేమానురాగాలకు గుర్తుగా 'తాజ్‌మహల్' కట్టించాడు మరి నే పోతే నన్ను గుర్తుంచుకుంటారా?" నిష్ఠూరంగా అంది సుబ్బలక్ష్మి సుబ్బారావుతో.

"ఎందుకలా బాధపడతావే! మళ్ళీ వచ్చే కట్నంతో బ్రహ్మాండమైన భవంతి నీ పేరుతోనే కట్టిస్తా" అన్నాడు సుబ్బారావు

—ఎమ్. మోజస్ (విజయవాడ)

తెలుగు మహాసభలు —రాగతిపండరి





చూద్దాం ?

"ఎటుచూసినా ఒకేలా వుండే 'కిటికీ' లాంటి మాట ఒకటి చెప్పు చూద్దాం" అన్నాడు మురళి మధుని.

"పోరాపో." అన్నాడు మధు ఠక్కున

-ఐ.పి. వాట్స్ (గోదావరిఖని)

ఈ ఉత్తరం చదవగానే అప్పల నరసమ్మకి ఏనుగెక్కినట్లూ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించినట్లూ, కొత్తగా నవలలు వ్రాయటం మొదలెట్టిన రచయిత్రి ఒక అభిమాన పాఠకుడి నుండి మొదటిఉత్తరాన్ని అందుకొన్నట్లూ ఆనందపడింది.

సంవత్సరం గడిచింది.

ఈ సం॥లో అప్పలనరసమ్మ పేరు అన్ని పత్రికల్లోనూ పడింది, ఉత్తరాల శీర్షికలో. ఆమె పేరు చాలామంది పాఠకులకు—ముఖ్యంగా ఉత్తరాల రచయిత(త్రు)లకు పరిచితమైంది. అరువుతెచ్చితప్ప కొని చదవటం ఎన్నడూ అలవాటు లేని ఆమె, తన ఉత్తరం పడిన పత్రిక లన్నింటినీకొని, బామ్మ గారి భోషాణంలోని వస్తువులను ఖాళీచేసి, తనపేరు పడిన పత్రికల్ని అందులో సర్దింది పత్రికలు కొనటంవల్ల పెరిగిన అదనపు ఖర్చు నెలకి పదిరూపాయలని ఆమె తల్లి సణిగేది. తండ్రి మాత్రం ఏమీ అనేవాడుకాదు.

ఒకరోజో ఉత్తరం వచ్చింది అప్పలనరసమ్మకి, మేనబావయిన ఆంజనేయరావ్‌నుంచి. అందులో సెన్సారు చెయ్యగా మిగిలినమేటర్;

"నరుసూ,

నా ఆశీర్వాదం ప్రకారమే నువ్వు ఉత్తరాల రచయిత్రిగా ఉన్నత శిఖరాల నందుకొన్నావని, ఇప్పటివరకూ ప్రముఖ పత్రిక లన్నింటిలోనూ అచ్చయిన నీ ఉత్తరాలు చెపుతున్నాయి. నీ రచనలు చూడగా నాకొక చక్కటి అయిడియా వచ్చింది. 'ఇన్ని ఉత్తరాలు రచించిన అనుభవంతో నువ్వు కథలు, నవల్లు ఎందుకు రాయగూడదు ?' నీకు తెలుసో, తెలీదో ! ఇప్పటి ప్రముఖ రచయిత చింతపిక్కల పిచ్చేశ్వర్రావు ఉత్తరాల రచయిత స్టేజి నుంచి నవల్ల రచయితగా ఎట్లా మారాడనీ ? ముందు పత్రికలకి ఉత్తరాలు రాసేవాడు తర్వాత జోకులు. ఆ తర్వాత చిన్నపిల్లల కధలు. తర్వాతర్వాత కథలు ఇప్పుడు నవల్లు పుంఖానుపుంఖాలుగా రాస్తున్న విషయం నీకు తెల్సిందే ! నువ్వు చదివే వుంటావేమో, అతడు రాసిన 'అపాయంలో ఉపాయం' దీన్నే వెనుకనుండి ముందుకు రాసి 'ఉపాయంలో అపాయం' అన్న పేరు పెట్టాడు రెండూ బహుళ పాఠక జనాదరణ పొందినవే!

నువ్వు కథ వ్రాయటం మొదలు పెడతావని, అవి పత్రికల్లో త్వరలో చూస్తానని ఆశిస్తున్నాను.

—నీ అంజి !"

అప్పలనరసమ్మ ఉత్తరం చదివాక ఆలోచనల్లో పడింది. 'తను రాయబోయే కధకి కధా వస్తువు ఏం తీసుకొంటామా ?' అని. చివరకి పొద్దున్న పంపు దగ్గర జరిగిన పోట్లాట గురించో లేక క్రితంరోజు హనుమాయమ్మ గారు కూరలమ్మితో వేసుకున్న తగవు గురించో వ్రాసేద్దామనుకొంది.

ఊహ వచ్చినంత తేలికా వ్రాయటం ? !

అప్పలనరసమ్మ తన ఊహని కధగా మల్చటంలో సాయంత్రం వరకూ తంటాలు పడి, ఆఖరికి కధ రాశా నన్పించి, దానికి 'పంపు దగ్గర పోట్లాట—పడతుల సిగపట్లాట !' అని శీర్షిక పెట్టింది.

మరునాడా కధని జాగ్రతగా ఫెయిర్ చేసి, ఒక పత్రికకి పంపి, రిజల్ట్‌కోసం మర్నాటి నుండీ ఎదురుచూడసాగింది.

పదిహేను రోజులకి అప్పలనరసమ్మని వెదుక్కుంటూ తిరిగొచ్చేసిందా కధ !

అప్పలనరసమ్మ హతావశురాలైంది. అన్న పానీయాలు ముట్టడం మానేసింది. ఆమె పరిస్థితిని వివరిస్తూ ఆమె తమ్ముడొక ఉత్తరం వ్రాశాడు ఆంజనేయరావ్‌కి. వెంటనే ఆంజనేయరావు రెక్కలు గట్టుకొని వచ్చివాలాడు అప్పలనరసమ్మని ఓదార్చాడు.

"పిచ్చీ ! కథ తిరిగొచ్చినంతలో ఇంతగా డీలాపడిపోవాలా ?" అన్నాడు.

"ప్చ్.... ఇంత నిరాశ దేనికి ? నీ పద్ధతి నాకేం నచ్చలేదు !" అని ఒక గజం నిట్టూర్పు విడిచాడు.

"ఆ పత్రిక ఎడిటరెవరో స్త్రీ ద్వేషి అయుంటాడు, లేకపోతే ఆడపిల్ల పంపిన కధను త్రిప్పి పంపించడవేఁ ! ఎంత సాహసం ! ఏఁవి ధైర్యం ? !" అని హుంకరించాడు.

"నువ్వు నా మాట విని లేచి హుషారుగా ఉండు. నీ కధని "........" పత్రికకి పంపు. అందులో ఉత్తరాల దగ్గర్నుంచి సీరియల్స్ వరకూ అన్నీ ఆడవారి రచనలే ! నీ కధని ఆ పత్రిక వేసుకొకపోతే నేను బియ్యే ఫైనలియర్ పాసయినంత ఒట్టు" అని ఒట్టేసి, ఆమెను ఉత్సాహపరిచాడు.


అప్పలనరసమ్మ మేనబావ ఓదార్పు మాటలతో ఊరట చెందింది. ఆమె అన్న పానీయాలు ముట్టాక, ఆమెతో ఒకసినిమాచూసేసి దగ్గరుండి అమె కధను ఫెయిర్ చేయించి, స్వయంగా '........' పత్రికకి పోస్ట్ చేసి, తమఊరు ప్రయాణమయ్యాడుఅంజనేయరావ్.

ఆంజనేయరావ్ అన్నమాట ఫలించింది. అప్పలనరసమ్మ పంపిన కధ ఆ పత్రికలో పడింది.

అంతే ! తన మొదటి కధ అచ్చయిన పత్రిక కాంప్లిమెంటరీ అందుకొన్న రోజున అప్పలనరసమ్మ మరో నాలుగు కధలు వ్రాసేసింది. మర్నాడే ఒక నవల వ్రాయడానికి పూనుకొంది.

అనతికాలం లోనే ఆమె రచనా వ్యాసంగం నెలకి మూడు నవలలు, ఆరు కథలుగా వర్ధిల్లింది !

✱




బాబూభాస్కర్,

అమ్మ నీకోసం కలవరిస్తోంది. నువ్వు రాకపోతే అమ్మదక్కదు. నువ్వు తక్షణం బయలుదేరి రావలసినది. ఎక్కడున్నావో వెంటనే తెలియజేయి.

మీనాన్న

సుంకర వెంకట్రావు

(CA-519)